# బంధం



విశ్వనాథం బడిపంతులుగా రిటైరయ్యి పది రోజులయ్యింది. పిల్లలతో విసిగిపోయి రిటైరయిన రోజు హాయిగా ఫీలయ్యాడు. బడిపంతులుగా వెల గబెట్టిన కాలంలో సంపాదించిన డబ్బంతా పిల్లల చదవులకు సరిపోకపోగా ఎంతో కొంత అప్పు కూడా చేశాడు. ఆ అప్పు కొడుకులు తీరుస్తారని ఆయన ఆశ.

సహజంగా బడిపంతుల భార్యలందరూ భర్తల కెంతో సహకరిస్తూ ఉత్తమ ఇల్లాళ్ళుగా చెలామణి అవటం వింటూంటాం. చాలామంది భర్తలు రిటై రవ్వగానే సరిగ్గా అన్నం పెట్టక, కాఫీ నీళ్ళు పొయ్య టానిక్కూడా విసుక్కుంటూ, ఇప్పుడు నువ్వు వెలగబెట్టే రాచకార్యాలేమున్నాయి, ముడుచుకుని మూలకూర్చో అంటూ తెగ సాధించేస్తూంటారు. ఒక బడిపంతులు భార్యగా అన్నపూర్ణమ్మ విశ్వ నాథం రిటైరయిన పదిరోజుల్లో ఆయన దగ్గరే కూర్చుని ఆలనా పాలనా చూసుకుంటోంది.

రిటైరవ్వగానే కొన్నాళ్ళయినా వాళ్ళని రెస్టు తీసుకోనీయకూడదనుకున్నాడో ఏంటో యమధర్మరాజు ముందస్తుగా ఒకరోజు విశ్వనాథంకి కల్లోకి వచ్చాడు.

"ఏమయ్యా పంతులూ! మీ భార్యా భర్తల్లో ఒకరిని తీసుకుపోవాలని అను కుంటున్నాను. నిన్ను తీసుకువెళ్ళమం టావా, నీ భార్యని తీసుకుపొమ్మం టావా? జవాబు వెంటనే చెప్పు!" అన్నాడు అవతల అర్జంటు పని ఉన్న ట్లుగా విశ్వనాథానికి అయోమయ పరి స్థితి ఏర్పడింది. ఐదు నిముషాలు సేపు ఆలోచనలో పడిపోయాడు. ఆ తర్వాత యముడి కళ్ళల్లోకి సిగ్గుగా చూస్తూ "అయ్యా! నాకింకా కొంత కాలం బతకాలని ఉంది. కావాలంటే మా ఆవిడను పట్టుకుపో"అన్నాడు. యముడు వెంటనే మాయమయ్యి

అన్నపూర్ణమ్మ కల్లోకి వచ్చాడు.

"ఏమమ్మా మీ భార్యభర్తల్లో ఒక్క ళ్ళను తీసుకుపోవాలని అనుకుంటు న్నాను. నువ్వెలా కోరితే అలా చెయ్య టానికి నేను సిద్ధంగా ఉన్నాను. నీ జవాబు వెంటనే కావాలి"అన్నాడు.

అన్నపూర్ణమ్మ అదిరిపడింది. ఆమె కూడా అయోమయ పరిస్థితిలో పడింది. ఐదు నిముషాల తర్వాత ఆమె నోటిలోంచి "నాకు బతుకుమీద ఇంకా ఆశ తీరలేదు. ఆయన్నే తీసు కుపో!" అని సమాధానం వచ్చింది.

భళ్ళున తెల్లారింది. తనకొచ్చిన

జీడిగుంట నరసింహమూర్తి

కల గురించి భార్యతో చెప్పాలని విశ్వనాథం అనుకుంటుండగా, అన్నపూర్ణ ముందుగానే భర్త గదిలోకి వచ్చి "ఇలాంటి కల రావడమేమిటంటే!" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. వాళ్ళిద్దరూ యమధర్మరాజు కిచ్చిన సమాధానాలు ఒకరినొకరికి ఆశ్చర్యంగా అన్పించి, 'నన్ను తీసుకుపొమ్మని ఎలా చెప్పావే ఓ మహాపతివ్రతా!' అడిగాడు భార్యని విశ్వనాథం ఆశ్చర్యపోతూ"

"ఏమీలేదండి •• ముసలితనంలో భార్యలు పోతే భర్తల బతుకు చాలా అధ్వాన్నంగా ఉంటుంది. వాళ్ళకు సరిగ్గా తిండి పెట్టేవాళ్ళు ఉండరు. ఆలనా పాలనా పట్టించుకోరు. అదే భర్త పోయిన ఆడదైతే కనీసం వంటింట్లో చేరి చేదోడు వాదోడుగా ఉండి ఎలాగో కాలం వెళ్ళబోస్తుంది. భర్తకు ఆ అవకాశం ఉండదు. అందుకే కలలో బహుశా అది ఊహించుకుని చెప్పేసి ఉంటాను. మీరూ ఏమీ అనుకోవద్దు ఇలా ప్రవర్తించినందుకు"అంటూ బాధ పడిపోయింది.

"ఇంతకీ నన్ను తీసుకుపొమ్మని ఎందుకన్నారు చెప్పండి?" అంది కుతూహలంగా అన్నపూర్ణమ్మ.

"ఏమీలేదోయ్! పసుపు కుంకాలతో పదికాలాలు పచ్చగా ఉండాల్సిన దానివి మొగుడు పోగానే బ్రతికే బతుకు నీకు రాకూడదని, అందుకే ముందుగా నా చేతుల మీదుగా పోతేనే మంచిదని, సుమంగళిగా నీ జీవితం ముగియాలని యముడ్ని. అలా కోరాను. నేను చెప్పింది నిజంగా తప్పేనంటావా? విచిత్రంగా భార్యని చూస్తూ అన్నాడు విశ్వనాథం.

ఇలా ఇద్దరి కల్లోకి వచ్చిన యమధర్మరాజు నిజాన్ని గ్రహించినవాడై ఇద్దరిలో ఎవ్వరిని బాధ పెట్టకూడదని తలంచి కొడుకు దగ్గరికి ప్రయాణమైన ఆ భార్యాభర్తలిద్దరిని ఒక రైలు ప్రమాదంలో తన దగ్గరికి చేర్చుకున్నాడు.



# మూగబోయిన కళ్ళు...

కలల మాటున నా కళ్ళు ..
కాలాన్నడిగాయిలా...
నా పాత జ్ఞాపకాలలోకి
నన్నైనా తీసుకుపో!...
ఇప్పటికైనా ఆగిపో!!...
కానీ... కాలం సాగిపోతూనే ఉంది
నవ్వుకొంటూ... నా ఈ మాటలు వింటూ...
సమాధానం ఎప్పటికీ రాదని
తెల్సి... నా కళ్ళు మూగబోయాయి!...

ధీరజ